# అంతర్ధానం

శ్రీమతి వెంపటి జానకీపురుషోత్తముగారు

"ఇదుగో, గంగమ్మా! గోదావరివొడ్డున ఈమధ్యవదిగిన స్వాములారు బాగా చదువుకున్నాడటగా" అన్నది ద్వారక.

"ఇంతేనా నీవువిన్నది? చదువేకాదు జబ్బువాళ్ళకి మందులుకూడా యిస్తాడట" అన్నది గంగమ్మ.

"సంతానములేనివాళ్ళకి తాయెత్తుకూడా యిస్తాడట. ఎంతమందికో అనేక గ్రామాల్లో దాఖలా కన్పించిందిట కూడాను" అన్నది మరోకావిడ లక్ష్మిబాయమ్మ.

"మనంప్రశ్నఅడిగితే సమాధానము చక్కగా చెపుతాడని అంటారు. ఆయన యెక్కువకాలం సమాధిలో వుంటాడటండీ, విన్నారా?" అన్నది యొకవితంతువు.

"ఒకటేమిటి ఆయనసర్వవేత్త. భూతభవిష్యద్వర్తమానాలు అన్నీ తెలుసాయనకు. అట్లాంటివారి పాదాలకురోజూ నమస్కారంచేస్తావుంటే జన్మతరిస్తుంది" అన్నది ఓముసలమ్మ.

గోదావరివొడ్డుననున్న ధవళేశ్వరంలో ఒకరోజు తెల్లవారేటప్పటికి వీధిలో అమ్మలక్కలంతాచేరి అక్కడమఠంలోదిగిన స్వాములవారిని గురించి యింట్లోపనులు వదిలేసి యిట్లాచిత్రవిచిత్రాలుగా చెప్పుకుంటున్నారు. ఊరందరికి మరోకవిషయమేదీ పట్టలేదప్పుడు.

* * * *

ఈవిషయం ఆవూరిపెద్ద భీమయ్యగారుకూడా విన్నారు. అటువంటిస్వాములారు కొన్నాళ్ళు తన యింట్లోవుంటే తనయిల్లూ, తనపూర్వులూ, తనూ, అంతాతరిస్తారని స్వాములార్ని యింటికి పిల్చుకొస్తానని తనుస్నానంచేసి, విభూతిపెండెకట్లుతీర్చి, మఠానికేసివెళ్లి, స్వాములారి పాదాలకు నమస్కారంచేసి నిల్చున్నాడు. ఇంకాయోగంలోంచి కళ్లుతెరవలేదు స్వాములారు. పలకరిస్తేవారియోగానికి విఘ్నంకలుగుతుందేమోనని వూరకున్నాడు భీమయ్య. పోనీ తనక్రిందకూర్చుందామన్నా వారిఅనుజ్ఞలేందే కూర్చుంటే యేం తప్పో అని, చాతకపక్షిచకోరానికోసం నిరీక్షిస్తూవున్నట్టు స్వాములారు యెప్పుడుయోగంవీడి కళ్లుతెరుస్తారా అని నిరీక్షిస్తున్నాడు భీమయ్యగారు. మధ్యాహ్నం రెండుజాములకి సమాధిలోంచి నేత్రాలువిప్పేడు స్వామి. ఘనమైన భక్తిశ్రద్ధలుకనపరుస్తూ మళ్లీసాష్టాంగంపడిలేచేడు భీమయ్యగారు. కూర్చోమని సౌజ్ఞచేశాడు స్వాములారు. భీమయ్యకూర్చున్నాడు. "తమరు మాయింటికివిజయంచేసి తమరు ఈగ్రామంలోవున్నన్నాళ్లూ మాయింట్లోనేవుండి నన్ను కృతార్థునిచేయవలె"అని ప్రార్థించేడు.

"మేము సర్వసంగపరిత్యాగులం. ఇళ్లల్లోవుండం. మాకీగోదావరివొడ్డున చాలాసౌఖ్యంగావుంది" అన్నాడు సన్యాసి.

"పోనీండి క్షమించండి. అట్లాగైతే భిక్షకైనా దయచేయమని నాప్రార్థన"అన్నాడు.

"నేను భోజనంచెయ్యను. భిక్షకొరకు వెదుక్కుంటూ పోయేదీలేదు" అన్నాడు స్వాములారు.

"మరియేంపుచ్చుకుంటారు?" అన్నాడు సవినయంగా భీమయ్య.

"క్షీరం, ఫలం" అన్నాడు కాషాయాంబరి.

"అవేపట్టుకొస్తాను" అని, స్వాములారు వేదాంతం వ్యాఖ్యానంచేస్తూవుంటే కొంతసేపు విని యింటికి వెళ్ళిఆయనకు పాలు, పండ్లు పంపేడు భీమయ్య. అప్పటినుంచి నిత్యము స్వాములారికి పాలు, పండ్లు ఎక్కువ సప్లయి భీమయ్యగారిదే.

* * * *

స్వాములారు మధ్యాహ్నం ఒంటిగంటలగాయతూ సాయంకాలం నాలుగుగంటలవరకూ ప్రజలతో మాట్లాడుతారనీ, తక్కినకాలమంతా యోగంలోవుంటారనీ వదంతిపడ్డది. అంచేత జనంయింట్లోపనులు తొందరగా చేసుకునో, చేసుకోకనో పన్నెండుగంటలనుంచీ నిత్యం మఠానికివెళ్లడం ప్రారంభించేరు. కొంతమంది ఆయన వేదాంతంచదువుతూంటే వినడానికని, మరికొందరు రోగాలకు యేంమందుచెపుతారో అని, కొంతమంది ముసలమ్మలు కోడళ్లకుగాని, మనుమరాళ్లకుగాని సంతుకలగడానికి తాయెత్తుయిస్తారేమోనని, యింకా కొందరు ముందు తమకేమి అదృష్టంరానున్నదో ప్రశ్నలువేసి తెలుసుకుందామని, అంతా పండ్లు పుచ్చుకుని వెళ్లి ఆయన ముందుపెట్టి నమస్కరించినుంచునే వాళ్లు. ఆయన వచ్చినవారిని అంతాకూర్చోమనిచెప్పి యెవరే వడిగినా శాంతంగా అందరికీ జవాబులుచెప్తూవుండేవాడు. నాలుగుగంటలుకాగానే అంతా స్వాములారివద్ద సెలవుతీసుకొని వెడుతూ ఆయన సాక్షాద్విష్ణుమూర్తేనని, లేకపోతే యిన్నిసంగతులు తెలియడంకష్టమని, ఆయన వ్యాఖ్యానంచేస్తూవుంటే ఆయనవాగ్ధారవింటే పారవశ్యంకలుగుతుందని ఆయన్నిగురించి శ్లాఘిస్తూ వెళ్లేవారు. స్వాములారి గొప్పతనం, ప్రతిభావిశేషం ధవళేశ్వరంచుట్టుపట్లంతా వ్యాపించింది. ఎక్కడెక్కడ నుంచీకూడా తీర్థానికివచ్చినట్లు ప్రజ రావడం మొదలెట్టేరు. ధవళేశ్వరంఅంతా యెక్కడచూచినా జనంతో కిటకిటలాడుతోంది.

* * * *

"ఇదుగో భాగీరథమ్మా రోజూ చెప్పాలనుకుంటాను. సమయానికిజ్ఞాపకంరాదు" అన్నది లక్ష్మిబాయమ్మ.

"ఏమిటీ? ఇప్పుడు జ్ఞాపకంవచ్చిందిగా చెప్పు" అన్నది.

"రోజూ నీవు వేదాంతంవినడానికి వెడుతున్నావుగా?" అన్నది.

"ఆఁ, వెడుతున్నా."

"ఇంట్లో రోజూ నీకోడలు నీతోపోట్లాడుతోందికదా? కొడుక్కి నీమీదక్రోధం ఏర్పడుతోందికదా? ఈసంగతి స్వాములారితో చెప్పకపోయినావా?" అన్నది.

"అదే ఆలోచిస్తున్నా నేనూను."

"ఆలోచనలెందుకూ? మొగవారు కోపంచేస్తారనా?"

"అదికాదు. ఈపోట్లాటలకి స్వాములా రేం చేయగలుగుతారని."

"ఇంతమందికి యెన్నివిషయాల్లోనో చెప్పగాలేంది నీకుచెప్పరూ? ఏదోచెప్తుతారు వెళ్లు."

"అయితేవెళ్లి అడిగి కనుక్కుంటాను మరి."

* * * *

చిన్నపిల్లలదగ్గరకీ, స్వాములారిపాటి పెద్దవాండ్లదగ్గరకి రిక్తహస్తాలతో వెళ్లకూడదని రెండుబత్తాయి పండ్లు, నాలుగు గన్నేరుపుష్పములు తీసుకుని భాగీరథమ్మవెళ్లి స్వాములారి ముందుంచి ఆయనపాదాలకు మ్రొక్కింది.

"కూర్చోండి" అన్నాడు స్వాములారు.

కూర్చుని "నాదొకమనవి" అన్నది.

"అభ్యంతరంలేదు చెప్పండి."

"నాకోడలు రోజూ నాతోపోట్లాడుతుంది. నాకుమారునికి నామీద క్రోధంపుట్టింది. పోట్లాట లేకుండావుండేటట్టు విభూతికాని మరేదైనాయిచ్చి అనుగ్రహించాలి."

"దీనికి విభూతికాదు."

"మరేమి సెలవు?"

భాగీరథమ్మగారి ఒంటిమీది నగలుచూచేటప్పటికి సాములారికి ఆలోచనపోయింది.

"దీనికి ఒక జపంవుంది. అది నేర్చుకుని నిత్యం చేస్తూవుంటే ఇట్లాంటి గృహచ్ఛిద్రాలువుండవు."

"అయితే ఆజపం నాకుచెప్పండి చేస్తాను."

"ఇప్పుడుకాదు. రాత్రి. నక్షత్రాలురావాలి. ఏదైనా పుణ్యస్రవంతిలో అర్ధరాత్రివేళ ఏకాంతంగా నుంచుని నేర్చుకోవాలి. చాలాకష్టం" అన్నాడు సన్న్యాసి.

"ఫరవాలేదు. ఎట్లాగైనా పోట్లాటతగ్గితేచాలు. తమయాజ్ఞ. నేనురాత్రి పన్నెండుగంటలకువస్తాను."

* * * *

తెల్లవార్తోంది. కాకులుకూస్తున్నాయి. అప్పటికప్పుడే వూరిజనమంతాస్నానాలకి గోదావరికి వెడుతున్నారు. వీరంతా గోదావరిలో దిగేటప్పటికి జలంలో ఒకశవం తేలుతోంది. ఆశవాన్ని పట్టుకుని వొడ్డుకు తీసుకొచ్చి చూచి ఆశ్చర్యపోతున్నారు. "ఇదేమిటి? భాగీరథమ్మర్రా. ఎట్లాచచ్చిపోయిందీ? అయ్యో! అయ్యో! ఒంటిని ఒక్కవస్తువేనాలేదే. వుస్తెనాకనపడదే. వస్తువులేమైనాయిచెప్మా" అంటూ అందరు తలోమాటా మొదలుపెట్టేరు. "ఒంటినిండా వస్తువులతో రొప్పుకొంటూవస్తూవుంటే పార్వతీదేవిలాగుండేది" అని కొంతమంది విచారపడుతున్నారు. ఈసంగతి భాగీరథమ్మగారి భర్త విన్నాడు. అతనువచ్చి శవాన్నిచూచి నిర్ఘాంతపోయి ఆవురుమన్నాడు. ఆవిడ గోదావరి కెప్పుడువచ్చింది అని అంతాఅడిగేరు. "స్వాములవారిదగ్గిర జపంనేర్చుకువస్తానని రాత్రివెళ్లింది. యేమోయింకారాలేదనుకుంటున్నాను. నాకొంప తీశావురా స్వామి!" అన్నాడు. "ఇంకేమి? స్వాములార్ని అడిగితే అంతా తెలుస్తుంది" అని అంతా మఠానికి బయల్దేరి వెళ్లేరు. అక్కడికివెడితేయేముంది? మఠం శూన్యం. వస్తువులతోకూడా స్వాములారంతర్ధానంఅయినాడు. జనంఅంతా "ఈహత్య స్వాములారిదే. సొమ్ముకోసం యెంతమోసం యెంతమోసం" అని ముక్కుమీద వేలువేసుకున్నారు.

## అత్తింటికి పయనము

కందుకూరి రామభద్రరావుగారు

కురులుసవరించి, చేమంతివిరులుదాల్చి,
నుదుటఁ గుంకుమచుక్కను బదిలపఱచి,
రమ్యముగఁదీర్చి క్రొత్తచీరనుధరించి
భర్తతో బాల నౌకపైఁ బయనమయ్యె.
తనయునంపఁగఁ దల్లి రేవునకువచ్చి,
నావనాలుగుబారలు నడిచినంత
"అమ్మ! నేనుండు: జాగ్రత్త" యనుచుఁజెప్పె
నశ్రువులనద్దుకొనుచుఁ జేలాంచలమున.
బాలకందోయినుబుకు బాష్పములడంపఁ
బక్ష్మములనప్పళించు నవ్వలికిఁదిరిగి,
పొంగిపొరలెడిదుఃఖము మ్రింగుకొనును
భర్తచూచిననలుగునన్ భయముకలన.

తరణికిరణములకుఁ బానీతలమునడ్డి
అంతకంతకుదూరమై యరుగునావ
వైపునకెజూచుమాత రెప్పలనునిలిపి
అకటపిల్లన్నఁ బ్రేమ యేలతివకైన.
చూచుచుండంగఁ దనతల్లిచుక్కయగుచుఁ
బ్రక్కవస్తువు లందానవాలులేక
పోయినను బాల ఆవైపె పొంచిచూచుఁ
దల్లికొఱకయి; ప్రేమయెంతటిదో కాని!
మగనికౌగిలిసుఖమునెమ్మదిఁదలంచి
భర్తతోనేగ నంతసంబరమువడియుఁ
గంటతడిపెట్టె నాబాల కడకదేమొ!
పుట్టినిల్లన్నఁదీపి యేపొలఁతికైన.